నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్



అధికారులకు సూచనలిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని మాచర్ల రూరల్ సెక్షన్‌కు సంబంధించిన 33/11 కేవీ ఎన్ డ్యామ్ గన్నవరం, తాళ్లపల్లి, అమ్మాని జమ్మలమడక గ్రామాలలోని సబ్ స్టేషన్‌లను పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 కేవీ ఫీడర్స్, ట్రీ క్రోస్‌లు, ట్రిప్పింగ్‌ల సమస్యలు తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. మాచర్ల టౌన్ సెక్షన్‌లో స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ ఎఫ్ క్లాస్‌ల డి లిస్టులను వెరిఫికేషన్ చేసి పలు సూచనలు చేశారు. ఈఆర్‌ఓ ఆఫీసును తనిఖీ చేసి వినియోగదారుల బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సింగయ్య, డీఈ రామయ్య, ఏఈలు కోటేశ్వరరావు, శ్రీశైలం, ఎల్‌ఐ రామేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

గురజాల/ గురజాల రూరల్: పల్నాడు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండల పరిదిలోని పలు గ్రామాల్లో వర్షం పడింది. అక్కడక్కడ చెట్టు కొమ్మలు విరిగి కింద పడ్డాయి. చిన్న చిన్న దుకాణాలు పాక్షికంగా దెబ్బదితిన్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల దాటికి బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద గల ట్రాఫిక్ పోలీస్ బాక్స్ కిందపడింది. చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని ఏర్పాటుచేసిన భారీ ప్లెక్సీలు కిందపడిపోయాయి. ప్లెక్సీలు విద్యుత్ తీగలపై పడిపోయాయి. కొన్ని రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న పల్నాడు ప్రాంత ప్రజలకు వర్షం రూపంలో కొంతమేరకు ఉపశమనం లభించింది. మంగళవారం సుమారుగా గంటకు పైగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీటితో జలమయం అయ్యాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపై చేరి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజులుగా 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు జరిగాయి. ఈ వర్షంతో కొంతమేరకు ఉపశమనం లభించిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జానపాడు రైల్వే బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సాతులూరి బాబు

పిడుగురాళ్ల: జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని వైస్ ఎంపీపీ సాతులూరి బాబు కోరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏళ్ల తరబడి జానపాడు రైల్వే బ్రిడ్జి వద్ద అవస్థలు పడుతూనే ఉన్నామని చెప్పారు. అంతేకాకుండా గేటు పడిన సమయంలో ఎంతో మంది ప్రాణాలను పోగొట్టుకున్న కుటుంబాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యను రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం దృష్టికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తీసుకొని వెళ్లి రూ.52 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులను ప్రారంభించడం లేదని ఆరోపించారు. పనులు ప్రారంభించకపోతే వైఎస్సార్ సీపీ, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో హైకోర్టులో పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాతులూరి రమేష్, జానపాడు వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్ల పోగు సాల్మన్, సాతులూరి పీరయ్య, తాళ్లపోగు కొండ ఉన్నారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గురజాల: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎంచంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల సింగరయ్య యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, వారికి శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీ ప్రకారం ఒక్కటి కూడా సరిగ్గా చేయలేదన్నారు. ఒక్కొక్కరికి మిషన్ కింద రూ.4,300 శిక్షణ ఇచ్చినందుకు రూ.3వేలు మొత్తం రూ.7,300లు మాత్రమే ఖర్చు చేశారని మొత్తం ఈ పథకం కింద సుమారుగా రూ.157 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, మాజీ కన్వీనర్ సిద్దాడపు గాంధీ, వి.అమరారెడ్డి, గోళ్ల సైదయ్య, జక్కా సత్యం, నారాయణ, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులు



గుట్లపల్లిలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న అధికారులు

బొల్లాపల్లి: నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తరువాత ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదయ్యాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గుట్లపల్లి గ్రామ పరిసరాల్లో స్టేషన్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నాటుసారాయికి వ్యతిరేకంగా గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు జరపడం జరిగింది. బొల్లాపల్లి మండలంలో 18, ఈపూరు మండలంలో 20, రొంపిచర్ల మండలంలో 20 కేసులు నమోదు చేసి 103 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కల్లులో ఎటువంటి కల్తీ జరగకుండా నివారించడం కోసం శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపడం జరిగిందన్నారు. స్టేషన్ పరిధిలో నాటుసారాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు మొదలైన నేరాల గురించి సమాచారం అందించాలని సూచించారు.

కూరగాయలతో వాసవీ అమ్మవారికి అలంకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారి జన్మదిన పర్వదినాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

నేడు వాసవి అమ్మవారి జన్మదిన వేడుకలు



రెంటచింతల: స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఛైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కారెంపూడి: కారెంపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ మేకల శారద అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 15 మంది ఎంపీటీసీలలో అంతా వైఎస్సార్ సీపీకి చెందిన వారే. అయితే తర్వాత కాలంలో ఇద్దరు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న వేపకంపల్లి ఎంపీటీసీ కోకా అక్కమ్మ మృతి చెందారు. ఈ మధ్య కాలంలో వైస్ ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని టీడీపీ యత్నించింది. అయితే వైస్ ఎంపీపీ ఎన్నికకు రెండు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించగా సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో ఎన్నికల అధికారి రెండు సార్లు ఎన్నికను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో రేపు నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంపై ఉత్కంఠ నెలకొంది.

భూసార పరీక్షలు తప్పనిసరి



పాలువాయి(రెంటచింతల): పంటల సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు ఎంతో మేలు అని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి తెలిపారు. సాగుకు సమాయత్తం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలువాయిలోని రైతుసేవా కేంద్రం పరిధిలో పంటపొలంలో మట్టినమూనాల సేకరణ, భూపరీక్షలపై మంగళవారం అవగాహన కల్పించారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లతే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. సమావేశంలో వీహెచ్ఏ తిరుపతినాయక్ పాల్గొన్నారు.

యువతికి ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పేద ముస్లిం యువతి వివాహానికి ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అసోసియేషన్ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, మరిన్న సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. పేద ముస్లింలు ఆర్థికంగా వెనుక బడ్డామనే ఆలోచన రాకుడదనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముజీబ్, తాజుద్దీన్, ఆరీఫ్, ఇర్షాద్, ముస్తఫా, నన్నేసా పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం



రెంటచింతల: ఏ సంఘం వారు అయిన ఏ వ్యక్తి అయినా వారి హక్కులకోసం పోరాడటం తప్పు కాదని సాటి ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడటం చాలా తప్పని ఎంపీహెచ్ఈఓలు శర్మ, ఆంజనేయులు పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీఎస్ వారు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రం ముందు ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శర్మ, ఆంజనేయులు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీఎస్ వారు అన్న మాటలకు క్షమాపణ చేప్పే వరకు ప్రతి ఒక్కరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఏఎన్ఎంలు ప్రమీల, విజయలక్ష్మి, అంజలి, రమాదేవి, సౌభాగ్యవతి, శిరీషా మాట్లాడారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

వినుకొండ: పట్టణంలోని ఏనుగుపాలెంలో రోడ్డులోని రైల్వే గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు పరిశీలన చేశారు. స్థానిక తహసీల్దార్ సురేష్‌నాయక్, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ చండీరాణి, ఆర్ఐ శ్రీధర్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భవితకేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోండి...



బాలికతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా సమగ్ర శిక్షా ఐఈడీ జిల్లా కో ఆర్డినేటర్ సెల్వరాజు

రెంటచింతల: ప్రత్యేక అవసరాల కలిగిన బాలబాలికలు, వారి తల్లిదండ్రులు వారికి సమీపంలో ఉన్న భవిత కేంద్రం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సమగ్రశిక్షా ఐఈడీ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.సెల్వరాజు కోరారు. మంగళవారం మండలంలోని పశర్లపాడు, కొత్త పాలువాయి, తుమ్మకోట, రెంటచింతల గ్రామాలలో ఆయన పర్యటించారు. ప్రత్యేక అవసరాలు గల బాలబాలికల నివాసాలను సందర్శించి వారికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ అలవెన్సులు, భవిత కేంద్రం ద్వారా పొందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట రెంటచింతల ఐఈఆర్‌పీలు శివారెడ్డి, రాజు, హరికుమార్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంతో బంగారు భవిష్యత్



సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలికుమారి

పిడుగురాళ్లరూరల్: కిశోరి వికాసం ద్వారా బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్య కరమైన సాధికారతకు దిశగా ఆమె వేసే అడుగు ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలికుమారి అన్నారు. మండలంలోని కామేపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆరోగ్య స్వాలంబన మెరుగుపరుచుకోవటం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యమన్నారు. గ్రామంలోని బాలికలు సంఘాలుగా ఏర్పాటు కావాలని, తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసుకునేవిధంగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఎం దుర్బేక్షా, మహిళా పోలీస్ సుధా, అంగన్వాడీ కార్యకర్తలు ఇట్టే రాములమ్మ, ఎం.గీత, బి.మాధవి, ఆశ వర్కర్ మరియమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



వెంకటరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నెమలి వెంకటరెడ్డి మృతదేహం వద్ద గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ వెంకటరెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ కందుల జాను, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, కొమెరబత్తిన విజయ్‌కుమార్, మందపాటి కృష్టారెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ఎన్నో అనర్థాలు



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంఏ చిష్టి

నకరికల్లు: పేద ముస్లింల కోసం, ధార్మిక కార్యక్రమాల కోసం భూమి, నగదు లాంటివి దానంగా ఇవ్వడాన్ని వక్ఫ్ అంటారని ఆవాజ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంఏ చిష్టి అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 వలన కలిగే అనర్థాలను వివరిస్తూ స్థానిక భగత్‌సింగ్ భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు పీడీఎం అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. చిష్టి మాట్లాడుతూ వక్ఫ్ చట్టం అతిక్రమంచి వేరే ఇతర కార్యక్రమాలకు దుర్వినియోగం చేయకుండా వందల ఏళ్ల క్రితం వక్ఫ్ చట్టం రూపొందించబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ పేరుతో తీసుకొచ్చిన 44 మార్పులు ఆమోదయోగ్యం కాదని అన్నారు. మోదీ విధానాలు ముస్లింలకే కాదు అన్ని వర్గాల ప్రజానీకానికి ప్రమాదం తెచ్చిపెడుతున్నాయన్నారు. అనంతరం ఆవాజ్ కమిటీ మండల కన్వీనర్ షేక్ దరియావలిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.విజయకుమార్, జి.పిచ్చారావు, ఈపూరి లక్ష్మారెడ్డి, ఈపూరి అప్పిరెడ్డి, చట్టు కోటేశ్వరరావు, షేక్ బాజి, షేక్ సుభాని, మడకా వెంకటేశ్వర్లు, షేక్ రబ్బాని, షేక్ సైదా, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మీరయ్య

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో ఎస్సీ మాదిగ కులానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబానికి ప్రాణహాని ఉందని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసుల దేనని ఎంఆర్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య అన్నారు. మంగళవారం సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావుకు జిల్లా కలెక్టర్ ఎండార్స్ చేసిన వినతి పత్రాన్ని అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ లింగాపురం ఎస్సీ కాలనీలో కంభంపాటి విద్యాధర్ కుటుంబం అంబేడ్కర్ జయంతి వేడుకలలో పాల్గొనటమే నేరంగా భావించి ఇంటి పైకి వచ్చి దాడి చేయటం దారుణమన్నారు. ఈ దాడిలో గాయపడిన విద్యాధర్ ఏప్రిల్ 17వ తేదీన ఫిర్యాదు చేస్తే జిల్లా కలెక్టర్ జోక్యంతో ఈ నెల 4వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసిన వెంటనే బాధితుడు విద్యాధర్‌కు అతని కుటుంబసభ్యలకు బెదిరింపులు, వేధింపులు మొదలు పెట్టారన్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్ బాధితుడు విద్యాధర్, అతని కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సత్తెనపల్లి డీఎస్పీని బాధితులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోమని ఆదేశించారన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు వెంటనే విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అగ్రకులాల వారికి భయపడి దళితుడైన విద్యాధర్ అతని కుటుంబసభ్యులు వేరే గ్రామంలో తలదాచుకుంటున్నారన్నారు. బాధితుడికి, కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బాధితుడు విద్యాధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టులో తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని కేకే ఫుడ్ కోర్టులో ఫుడ్ సేఫ్టీ అధికారులు, సివిల్ సప్‌లైస్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాసిరకం టీ పొడి, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పిండి పదార్థాలు, టేస్టింగ్ సాల్ట్ , ప్రభుత్వం సరఫరా చేస్తున్న పంచదార, పీడీఎస్ రైస్, డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించారు. డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీన పర్చుకున్నారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి నిర్వాహకులకు నోటీసులు పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, సివిల్ సప్‌లైస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



మాచర్ల రూరల్: ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దాలింగమూర్తి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యాన పంటలను గుర్తించి రైతులకు అవగాహన కల్పించాలని, ఉద్యానవన పంటల సాగు పై మేలు గురించి రైతులకు వివరించాలన్నారు. సేద్యపు నీటి కుంటలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీడీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై అవగాహన అవసరం



మాచర్ల రూరల్: కార్మికుల కష్టాలను ప్రతి ఒక్కరూ గుర్తించి వారి న్యాయమైన కోర్కెలను వెంటనే తీర్చాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ కోరారు. మంగళవారం పట్టణంలోని శ్రీ రామకృష్ణ వివేకానంద ధ్యాన మందిరంలో అసంఘటిత కార్మికులకు హక్కుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అనగా ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా తమ హక్కులను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చేసే పనిలో ఏదైనా ప్రమాదం జరిగినపుడు మీరు ఇన్సూరెన్సు చేసిన మీకు కొంత డబ్బు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం వస్తుందని, తద్వారా మీ కుటుంబానికి ఉపయోగపడుతుందన్నారు. కార్మికుల సమస్యలుంటే మండల న్యాయ సేవ కమిటీ వారి దగ్గర వారి సమస్యలకు పరిష్కారం చేసుకోవచ్చునన్నారు. సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మే ఒకటి నుంచి ప్రతి రోజూ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పిడుగుపాటుతో యువకుడు మృతి



దాచేపల్లి: పిడుగుపాటుతో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బాణావత్ శ్రీరాములు కుమారుడు శివనాయక్(19) ఇంటర్మీడియెట్ చదివాడు. కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులతో వర్షం కురుస్తుండటంతో శివనాయక్ ఇంటికి వస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వేసవి తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



చిలకలూరిపేట: నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈవో ఎ శ్రీనివాసరావును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా తరగతులు నిర్వహించటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, నాయకులు గుడిపల్లి జగదీష్, నాయుడు సాయి శ్రీనాథ్, కంచర్ల సన్నీ, అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వందమందికి పైగా ఆధార్ సేవలు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ సేవా కేంద్రాలు రెండో రోజు పనిచేశాయి. ఆధార్‌లో సవరణలు, శిశు ఆధార్, ఐదేళ్ళు పైబడిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ తదితర సేవలందిస్తున్నారు. రెండోరోజు వందమందికి పైగా కార్డుదారులు ఆధార్ అప్‌డేట్ సేవలు వినియోగించుకున్నారు. బుధ, గురువారాలు, ఈ నెల 12–15 తేదీల్లో విడతల వారీగా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ సేవలందించనున్నారు.